మామగారి బహుమతి

సౌమ్య, రవీంద్రలకు పెండ్లయి ఐదు నెల్ల యింది. ప్రశాంతమైన గోదావరి మీద పడవలా కుదుపుల్లేకుండా సాగిపోతున్నది వారి కాపురం. అయితే పైకి శాంతంగా కనిపించే గోదావరిలో కొద్దిపాటి సుడిగుండాలున్నట్లు రవీంద్ర మనసు లోనూ కొంచెం అసంతృప్తి ఉంది. చదువుకున్న వాడూ, స్వతహాగా నెమ్మదైనవాడూ కాబట్టి ఆ అసంతృప్తి బయటపడకుండా జాగ్రత్త పడుతు న్నాడు.

అయితే సౌమ్య మాత్రం అంత నెమ్మదైన అమ్మాయి కాదు. అలాని చెడ్డపిల్ల అసలేకాదు. ముక్కుసూటి స్వభావం. కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడే తత్త్వం. అభ్యుదయ భావాలు నర నరానా జీర్ణించుకున్న సంస్కారం.



ఇంతకూ రవీంద్ర అసంతృప్తికి కారణం ఏమిటంటే సౌమ్య తల్లిదండ్రులు తనకు కట్నం ఏమీ ఇవ్వలేదని. తన ఫ్రెండ్స్ అంతా ఎంచక్కా లక్షో లక్షన్నరో కట్నాలు తీసుకుని పెళ్లి చేసుకున్నారు. వాళ్లేమీ తనకంటే మంచి ఉద్యోగాలు చేసేవాళ్లు కాదు. అందగాళ్లూ కాదు. అయినా దర్జాగా కట్నాలు తీసుకుని నలుగురిలో గొప్పగా చెప్పుకుంటున్నారు.

"కట్నం ఎంత తీసుకున్నావురా" అని అడిగాడు స్నేహితుడు సుబ్రహ్మణ్యం ఒకరోజు. ఒంటరిగా ఉన్నప్పుడు అడగలేదు కూడాను. ఫ్రెండ్సందరితో ఉండగా అడిగాడు. దమ్మిడీ కూడా తీసుకోనప్పుడు అబద్ధం ఎలా చెప్పగలడు.

"నో డౌరీ" అన్నాడు తప్పుచేసినట్లు బాధపడుతూ.

"అదేమిట్రా" అని అడిగారు స్నేహితులందరూ.

"మనవాడిలో ఏదైనా లోపముందని అనుకున్నారేమోరా" అన్నాడు మరో ఫ్రెండ్ వెంకట్రావు.

సిగ్గుతో చచ్చేచావయింది రవీంద్రకు.

"పోనీ లాంఛనాలన్నా బాగా ఇచ్చారట్రా" అన్నాడు ఇంకో ఫ్రెండ్.

"లాంఛనాలా? అవేంటవి?" అడిగాడు రవీంద్ర.

"హారి పనికిమాలినవాడా! నువ్వు పైకెట్లా వస్తావురా? కట్నానికి తోడు లాంఛనాలంటే అత్తమామల దగ్గర నుంచి ఎంత వీలైతే అంత పిండడమన్నమాట. సూట్లనీ, స్కూటరనీ, టీవీ సెట్టనీ, బ్రాస్‌లెట్టనీ – ఇలా సాధ్యమైనంత ఖర్చు మామచేత పెట్టించడమన్నమాట" అన్నాడు

సిహెచ్.వి. బృందావనరావు

సుబ్రహ్మణ్యం.

"ప్చ్... మామగారు నాకలాంటివేవీ ఇవ్వలేదు" అన్నాడు రవీంద్ర.

"సరేలే, రేపు సంక్రాంతికి మాత్రం స్కూటరిచ్చిందాకా వదిలిపెట్టబాక" అన్నాడు వెంకట్రావు.

"నాకు అది కావాలనీ, ఇది కావాలనీ అడుక్కోడం ఎలారా?" అన్నాడు రవీంద్ర నీళ్లు నములుతూ.

"అల్లుడంటే అలాంటివేమీ మనస్సులో పెట్టుకోగూడదురూ. సిగ్గూ, శరమూ, మానము, అభిమానమూ ఇట్లాంటివేమీ అల్లుడికి వుండగూడదు. ఉంటే పైసా కూడా రాలదు మామ దగ్గర్నించి" అన్నాడు మరో స్నేహితుడు.

"పోనీ నువ్వు అడగలేకపోతే నీ భార్యచేత అడిగించరా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

తనకు స్కూటరు కావాలని, మీ నాన్నను అడిగి అది ఇప్పించమనీ సౌమ్యను అడిగితే ఏమౌతుందో ఊహించి, అలాంటి ప్రయత్నం ఏమీ చేయదలచుకోలేదు రవీంద్ర.

"సంక్రాంతి పండక్కి ముందురోజు, తర్వాతా రెండు రోజులూ ఆఫీసుకు సెలవు పెట్టు రవీ" అంది సౌమ్య ఓ రోజు.

"ఎందుకు?" అడిగాడు రవీంద్ర.

"మనం మా అమ్మానాన్నలతో పండగ రోజులు గడపడానికి పోతున్నాం. మా నాన్న ఫోన్‌చేసి పిల్చాడు కదా" అంది సౌమ్య.

"అలాగే" అని కొంచెంసేపాగి [illegible] వెంక

ట్రావుగాడు పోయిన సంక్రాంతికి అత్తగారింటి కెళ్లి, వాళ్ల మామనడిగి డబుల్ డోర్ ఫ్రిజ్ తెచ్చుకున్నాడు తెలుసా" అన్నాడు రవీంద్ర.

"అయ్యో పాపం" అంది సౌమ్య.

"అయ్యోపాపమేంటి? ఇందులో జాలిపడే దేముంది" అన్నాడు రవీంద్ర.

"పాపం వాడి జీతం వాడికి చాలడంలేదు గామాల. సొంతంగా కొనుక్కోగల స్తోమత లేదేమో. వాండ్ల మామగార్ని యాచించి అదేదో ఫ్రిజ్ ముష్టేయించుకున్నాడంటే జాలిపడక మెచ్చుకోవాల్నా" అంది సౌమ్య.

సౌమ్య చెప్పిన పద్ధతిలోని అసహ్యము, కోపము, వెటకారమూ గ్రహించిన రవి ఇంక ఈ సంభాషణను పొడిగించాలనుకోలేదు.

"అయినా నా ఫ్రెండుని నువ్వు 'వాడు, వీడు' అనడమేమైనా బాగుందా".

"నిజమే. ఏమాత్రం బాగాలేదు. మామను పీడించి, అతని కష్టసుఖాలు గమనించక అవీ ఇవీ కావాలని సాధించే వాండ్లని వెధవ అనో, అడ్డగాడిద అనో అనాలిగాని, 'వాడు వీడు' అంటం ఏం బాగుంటుంది? యు ఆర్ కరెక్ట్ రవీ" అంది సౌమ్య.

"అసలు నిన్ను కాదు అనాల్సింది. నీకు 'సౌమ్య' అని పేరు పెట్టాడే మీ నాన్న... ఆయన – ఆయన కాళ్లకు మొక్కాలి" అన్నాడు రవీంద్ర ఉక్రోషంగా.

సౌమ్య నవ్వి "అదెంత భాగ్యం. అందుకే కదా పండక్కి మాఊరు వెళదామనేది" అంది.

వాతావరణం కొంచెం తేలికపడడంతో తను చెప్పాలనుకున్నది చెబ్దామనుకున్నాడు రవీంద్ర. "నాకో స్కూటర్ కావాలి" అన్నాడు.

"నిజమే రవీ. ఆఫీసు చాలా దూరమాయె. స్కూటర్ లేకుంటే ఎట్లా? అందరు ఆడ పిల్లల్లాగా స్కూటర్ వెనక్కూచుని పొయ్యేదాని కన్నా నేనే డ్రైవ్‌చేస్తూ – నిన్ను వెనకెక్కించుకుని పోవాలని నాకు ఎప్పట్నించో ఉంది. ఇప్పుడు ప్రతి దానికీ బ్యాంకులు లోన్లిస్తున్నాయట కదా. రేపే ఏదైనా బ్యాంకులో కనుక్కో. అన్నట్టు స్కూటరు నడపడం నువ్వూ నేర్చుకో. రోజూ నిన్ను ఆఫీసులో డ్రాప్‌చెయ్యడం నాక్కుదరకపోవచ్చు" అంది సౌమ్య.

"నేను బ్యాంకు లోను తీస్కోవడం కాదు. మీ నాన్నకు చెప్పు ఓ స్కూటర్ కొనిమ్మని" అన్నాడు రవీంద్ర భయం భయంగానే.

అప్పుడు సౌమ్య చూసిన చూపుకు, ఆమె కళ్లల్లోకి చూడలేకపోయాడు రవీంద్ర. తన ప్రవర్తన సరిగా ఉన్నట్లు తనకే అనిపించలేదు. అసహ్యం నిండిన కళ్లతో అతనివైపు చూసి లోపలికి పోయింది సౌమ్య. బరువైన నిశ్శబ్దం ఆక్రమించుకొంది ఆ ఇంటిని ఆ రోజంతా.

సంక్రాంతికి సౌమ్య పుట్టింటికి పోయినారు రవీంద్ర, సౌమ్యా. పండగ నాల్రోజులూ చాలా సంబరంగా గడిచిపోయాయి. రోజూ రకరకాల పిండివంటలు చేసారు. ప్రేమగా అల్లుడికి తినిపించారు. సంప్రదాయంగా కూతురికి, అల్లుడికీ బట్టలు పెట్టారు. మరదలు, బావమరిదితో ఉల్లాసంగా గడిపాడు రవీంద్ర. ఊరిలోని తన స్నేహితులకు, ఇరుగుపొరుగులకూ అల్లుణ్ని ఎంతో గర్వంగా పరిచయం చేసాడు మామగారు. బావమరిదైతే తనను వదిలి ఉండనేలేదు. ఒక ఆత్మీయమైన ఆనందానుభవపు వాతావరణాన్ని అనుభవించాడు రవీంద్ర ఆ నాలుగు రోజులూ. తిరిగి వాళ్ల ఊరు వచ్చారు సౌమ్యా, రవీంద్రలు. మామ గారింట్లోని పండగ ఆత్మీయ

తల ఆనందంలో – మామగారు స్కూటరు ఇవ్వ లేదనే కొరత అడుగున పడిపోయినా – అంతర్ధా నం మాత్రం కాలేదు.

"మీ నాన్న పండక్కి స్కూటరిస్తాడనుకు న్నాను"

"నేను కూడా మీ నాన్న నాకో మైక్రోవేవ్ ఓవెను, గ్రైండరూ ఇస్తాడనుకున్నాను".

ఆశ్చర్యపోయాడు రవీంద్ర. "అదేంది? మా నాన్న నీకెందుకివ్వాల?".

"మా నాన్న నీకెందుకు స్కూటరివ్వాల?" అంది సౌమ్య.

"నేను అల్లుడిని. నాకు స్కూటరిస్తే తన కూతురుకిచ్చుకున్నట్లే కదా!".

"నేను కోడల్ని. నాకు ఇస్తే తన కొడుక్కు ఇచ్చుకున్నట్లే కదా!".

"అల్లుడూ, కోడలూ ఒక్కటేనా?"

"ఏం ఎందుకాదు?"

"నేను ఉద్యోగం చేసి డబ్బులు సంపా దిస్తున్నాను".

"నేను ఇంట్లో చాకిరీ చేసి డబ్బు సంపాది స్తున్నాను".

"అదెలా?"

"రోజూ వంట చేస్తున్నాను. గుడ్డలు ఉతుకు తున్నాను. అంట్లు తోముతున్నాను. ఇల్లు తుడు స్తున్నాను. వంటమనిషికి, చాకలి మనిషికి, పని మనిషికీ మార్కెట్ రేటు ప్రకారం లెక్కకట్టు. ఆ మేరకు నేను సంపాదిస్తున్నట్లా కాదా?" అంది సౌమ్య.

ఏమీ జవాబు చెప్పలేక అన్నాడు రవీంద్ర "నేను మగాణ్ని".

అన్నాడుగాని తన వాదన తనకే సంతృప్తి కరంగా లేదు.

"నువ్వు మగాడివైతే, నేను ఆడదాన్ని" అంది సౌమ్య.

"నేను ఆడదాన్ని అని గొప్పగా చెప్పుకుం టున్నావు. అదేమైనా క్రెడిటా"

"నేను మగవాణ్నని నువ్వు గొప్ప క్రెడిట్‌గా చెప్పుకున్నావుకదా. చూడు రవీ... సంసారం లో భార్య భర్తలిద్దరూ సమానమే. ఒకరెక్కువ, ఒకరు తక్కువ అనేది లేదు. ఇది చాలా సింపుల్ విషయం. అలాగే సమాజంలో కూడా పురుషు లూ స్త్రీలూ సమానమే. ఎవరూ ఎక్కువా కా దు, ఎవరూ తక్కువా కాదు. నువ్వింత చదువు కున్నావు. వివేచన ఉంది. కానీ నాలుగైదు శతాబ్దాల వెనకటి వాడిలాగా ఆలోచిస్తున్నావు. ఎక్కువ తక్కువలు ఫీలైతే ఏ కాపురమూ సుఖం గా జరుగదు. నాకు నిద్రొస్తోంది. గుడ్‌నైట్" అని పక్కకు తిరిగి పండుకొన్నది సౌమ్య.

చాలాసేపు నిద్రపట్టలేదు రవీంద్రకు. నిజ మే. తాను పోస్ట్‌గ్రాడ్యుయేట్. బాగా చదువుకు న్నాడు. కాస్తోకూస్తో సాహిత్య పరిచయమూ ఉంది. శ్రీశ్రీ, ఆరుద్ర, రావిశాస్త్రి లాంటి వాళ్ల రచనలు ఇష్టంగా చదువుతాడు. తన తెలివితే టలు ఏమైనాయి... ఇంత అసంబద్ధంగా ఆలో చించడానికి. సుబ్రహ్మణ్యం, వెంకట్రావూ లాం టి స్నేహితుల ప్రభావానికి తానూ లోనవుతు న్నాడుగాని, తన స్వంత విచక్షణను ఉపయో గించడంలేదు. ఏదో సినిమా పాటలో చెప్పినట్లు 'చదువుల సారం, సంసారమునకై పదిలము" చేయకపోతే ఆ చదువుకు ఏం ప్రయోజనం? తన మామగారు ఓ మధ్యతరగతి సంసారి. నేను సులభంగా కొనుక్కోగల వస్తువు కోసం

అయన్ను బాధపెట్టడం ఏమిటి. బాధపెట్టడం అలా ఉంచితే, ఇంకో వ్యక్తిని నాకు ఇది ఇమ్మని దేబిరించడం ఎంత ఆత్మ గౌరవంలేని పని. సౌమ్య ఎంత ఉత్తమురాలు. మాట కొంచెం ఖచ్చితంగా ఉంటుందిగాని ఆమె మాట్లాడిన దాంట్లో తప్పేమున్నది. నేనే సంస్కారం లేకుండా ప్రవర్తిస్తున్నాను" అని చాలాసేవు వితర్కించుకొని మనసు తేటపరచుకొని నిద్రకు ఉపక్రమించాడు రవీంద్ర.

సౌమ్యకూ నిద్రరాలేదు. 'ఇంత చదువుకున్న రవి ఇంత కుసంస్కారంగా ఎలా ఆలోచిస్తున్నాడు. మనిషి చాలా మంచివాడు. నెమ్మదస్తుడు. ఎవరితోనూ ఏనాడూ కఠినంగా ప్రవర్తించడు. ప్రేమమూర్తి. బహుశా స్నేహితులు మాట్లాడే మాటల ప్రభావం ఆయనకే తెలీకుండా ఆయన మీద పనిచేస్తుండవచ్చు. ఈ రోజు సమాజంలోని పరిస్థితులు అలాగే ఉన్నాయి మరి. మామూలుగా చెప్పేదానికి

AVM లిటిల్ స్టోరీస్

అది 2222 సంవత్సరం.

మహర్షి, మానసలకు ఒకే ఆఫీసులో పని.

మానసకు మూడో నెల. అందుకే మానస తల్లితండ్రులు పరువుకోసం ఒప్పుకున్నారు. మహర్షి వాళ్లకి నిజాయితీ ఇంటి పేరు.

కులాలు వేరైనా, ఇద్దరి ప్రేమనూ అంగీకరించి, ఒకటి అవడానికి శుభముహూర్తం నిర్ణయించారు పెద్దలు.

మహర్షి, వాళ్ల బంధువులతో దిల్‌షుక్‌నగర్ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కళ్యాణమండపానికి టాక్సీలో బయలుదేరాడు.

ఒక కిలోమీటరు వెళ్లారో లేదో ట్రాఫిక్ జామ్ అయి, మధ్యలో ఇరుక్కుపోయారు.

అవతల మానస వాళ్లు వీడియో సెల్‌ఫోన్లు, ఇటు మహర్షి వాళ్ల వీడియో సెల్‌ఫోన్లు విరామం లేకుండా మోగుతున్నాయి. పెద్ద పెద్ద వాళ్లతో సంప్రదించినా ట్రాఫిక్ జామ్ నుంచి బయటకు రాలేకపోయారు.

ఆ విధంగా ఆర్నెల్లపాటు ఆ ట్రాఫిక్‌లోనే ఉన్నారు.

మానస ఎదురుచూపులతో కళ్యాణమండపంలోనే ప్రసవించి, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వాడు పుట్టిన వేళావిశేషం బావుండి, ఆ తర్వాత రోజుకి మహర్షి వాళ్లు కళ్యాణమండపానికి చేరారు.

పుత్రుడి సమక్షంలో రికార్డెడ్ బాజాభజంత్రీలతో మహర్షి, మానసలు ఒకటయ్యారు ఆనందంగా.

తర్కవితర్కాలు చేసి నేనే రవిని రెచ్చగొడుతున్నా నేమో. ఇంకొంచెం సౌమ్యంగా ప్రవర్తిస్తూ, ప్రేమగా మాట్లాడుతూ రవిని మార్చుకోవచ్చు. రవి ఉత్తముడు. అతని ఆలోచనలను సరైన దారిలో పెట్టడం కష్టంకాక పోవచ్చు' ఇలా ఆలోచిస్తూ నిద్రపోయింది సౌమ్య.

నాల్రోజుల తర్వాత "సౌమ్యా, మనం ఉగాది పండక్కి మీ ఊరు పోతున్నాం" అన్నాడు రవి.

"సంక్రాంతికే గదా పొయ్యొచ్చాం. రెణ్నెల్లు కూడా కాలేదు కదా" అంది సౌమ్య.

"ఆ పండక్కి వాండ్లు పిలిస్తే పొయ్యాం. ఈ పండక్కి మనమే పోదాం. ఏం... పిలవకుండా పోగూడదా" అన్నాడు రవి.

"ఛఛ... అదేంలేదు. పండక్కి మన వాండ్లింటికి మనం పోవచ్చు. పిలుపే కావాలా?" అంది సౌమ్య.

ఉగాదికి వచ్చిన కూతుర్ని, అల్లుణ్నీ చూసి సంతోషించారు అత్తమామలు. పదో తరగతి చదివే మరదలు, ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాయబోయే బావమరిదీ – బావను, అక్కనూ చూసి సంబరపడ్డారు. పండగ సంతోషంగా గడిచిపోయింది. పండగరోజు సాయంత్రం తాను సౌమ్యక్కూడా తెలీకుండా తెచ్చిన పంచెలచాపు, షర్ట్‌పీసూ మామగారికిచ్చి, వెంకటగిరి చీర సౌమ్యచేత అత్తగారికి ఇప్పించాడు రవీంద్ర.

"ఇదేంది బాబూ, మేము కదా ఇవ్వాల్సింది" అంది అత్తగారు.

"సంక్రాంతికి మీరు ఇచ్చారు. ఈ పండక్కి మమ్మల్నివ్వనీయండి. ఇచ్చిపుచ్చుకోవడాలకు ప్రేమలు కారణం కావాలిగాని, అవి మొండి ఆచారాలై ఇబ్బందులు కలిగించకూడదు. తీసుకుని మమ్మల్ని దీవించండి" అన్నాడు రవీంద్ర. సంతోషించారు అత్తామామలు. సౌమ్యకు నిజంగా ఆశ్చర్యం వేసింది.

మర్నాడు ఊరికి బయలుదేరారు సౌమ్య, రవీంద్ర. రవీంద్ర మామగారు అల్లుడి దగ్గరకు వచ్చి ఓ ఇరవై వేల రూపాయల చెక్కు ఇచ్చి "బాబూ, నేను సంక్రాంతికే ఇద్దామనుకున్నాను. కానీ డబ్బు సర్దుబాటు కాలేదు. ఈ ఇరవైవేలు తీసుకుని, మిగిలిన డబ్బు నువ్వు వేసుకుని ఓ స్కూటర్ తీసుకో" అన్నాడు.

రవీంద్ర నవ్వి, ఆ చెక్కు తీసుకుని, బావమరిదిని దగ్గరకు పిలిచి అతని చేతిలో చెక్కు పెట్టి "నీ ఇంటర్మీడియేట్ పరీక్షలు కాగానే ఓ మోపెడ్ తీసుకో. అక్కర్లేదనుకుంటే ఆ డబ్బు నాన్నగారికిచ్చెయ్" అని మామగారి వైపు తిరిగి "మామగారూ, నాకు ఇంతకుముందే ఓ బహుమతి ఇచ్చారు. ఇప్పుడింకేమీ అవసరంలేదు" అన్నాడు.

"నేను, నీకు బహుమతి ఇచ్చానా?" ఆశ్చర్యంగా అడిగారు మామగారు.

రవీంద్ర సౌమ్యను చూపిస్తూ, "మీరు ఇచ్చిన ఈ బహుమతి నా జీవితం మొత్తం సంతోషంగా గడపడానికి సరిపోతుంది. ఇంకేమీ ఇవ్వాలనుకోకండి" అన్నాడు.

బస్సు ఎక్కి కూచున్న తర్వాత సౌమ్య రవీంద్రతో "రవీ, ఇవ్వాళ నువ్వు నాకు భలే ముద్దొస్తున్నావోయ్" అంది.

రవీంద్ర సౌమ్య కళ్లల్లోకి చూస్తూ "ఇంటికి పోయిందాకా ఆగుతావా, లేక బస్సులోనే ఏదైనా హడావిడి ప్రోగ్రాం పెట్టుకున్నావా?" అన్నాడు సీరియస్‌గా. ●